క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుధ్య పనులు

భైంసాటౌన్: పట్టణంలో జ్వర బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనులను ముమ్మరం చేశారు. సోమవారం శివారు కాలనీల్లో డ్రెయినేజీలు, మురికికాలువల్లో, నీటి గుంతల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అలాగే కాలనీవాసులకు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, జవాన్లు, సిబ్బంది ఉన్నారు.

ప్రతిఒక్కరికీ చదువు రావాలి

లక్ష్మణచాంద: ప్రతిఒక్కరికీ చదువు రావాలని మండల నోడల్ అధికారి అశోక్ వర్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 18- 35 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ చదువు నేర్పించాలన్నారు. ప్రతి ఒక్కరికీ చదువు రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్ ఖాన్, వైద్యురాలు ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భైంసాటౌన్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా శిక్షకులు అశోక్ ఆర్య విద్యార్థి అన్నారు. సోమవారం పట్టణంలోని నర్సింహానగర్ కల్యాణ మండపంలో పతంజలి యోగా, నర్సింహా యోగా గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల ఉచిత యోగా శిక్షణ ప్రారంభించారు. నర్సింహా యోగా గ్రూప్ సభ్యులు ముష్కం రామకృష్ణ గౌడ్, మహిపాల్ మాట్లాడుతూ.. ఐదురోజుల పాటు ప్రతీ రోజు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు, అలాగే మహిళలు, పిల్లల కోసం సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

లక్ష్మణచాంద: మండలంలోని న్యూ కంజర్ గ్రామంలో సీజనల్ వ్యాధులపై కళాజాత సభ్యులు సోమవారం అవగాహన చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులపై గ్రామస్తులకు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. పచ్చదనం పరిశుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ ఆఫీసర్ అమీర్ ఖాన్, కళాజాత సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి


వినతిపత్రం అందజేస్తున్న రాజూర గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 240 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, 10 మంది విద్యా వలంటీర్లులతో విద్యనందిస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ దాసరి ప్రవీణ్, తోకల సరస్వతి, మాజీ సర్పంచ్‌లు ముత్తగౌడ్, పోతన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వాలి


ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సోన్: బాల్య వివాహాలు చేస్తే 1098కు సమాచారం ఇవ్వాలని విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ రజిత అన్నారు. సోమవారం మండలంలోని సిద్దులకుంట ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన మానసిక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు భూమారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, నరేందర్, నేందర్, దశరథ్ పాల్గొన్నారు.

చిగురిస్తున్న యాసంగి ఆశలు

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం
- యాసంగి సాగుకు ఢోకా లేదని రైతుల ధీమా


సరస్వతీ కాలువ


శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ

మామడ: సరస్వతీ కాలువ కింద పంటల సాగు చేస్తున్న రైతులకు యాసంగి సాగుపైన భరోసా కలిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరదనీరు భారీగా చేరడంతో పూర్తిస్థాయి నీటి మట్టంతో నిండి ఉంది. సరస్వతీ కాలువపై ఆధారపడి సాగు చేసిన వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. మరో నెల రోజుల వ్యవధిలో వరి పంట చేతికందే దశకు చేరుకుంటుంది.

యాసంగి సాగుపై..

సరస్వతీ కాలువ కింద 28 డిస్ట్రిబ్యూటరీల పరిధిలో దాదాపు 35 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారు. ఏడాది వానాకాలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు ఆరంభంలో తక్కువగా వచ్చినప్పటికీ జూలై, సెప్టెంబర్‌లో ప్రాజెక్టు ఎగువన ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా భారీగా వరద నీరు వచ్చి చేరింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. 80.5 టీఎంసీలు. ప్రస్తుతం నీటిమట్టం 1090.9 అడుగులు, 80.05 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రాజెక్టులోకి 186 టీఎంసీలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 186 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి వరద నీరు ఎక్కువ నీరు రావడంతో 113 టీఎంసీల నీటిని నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు దిగువకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 6500 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. 8800 క్యూసెక్కుల నీరు కాలువల ద్వారా నీటి పారుదలశాఖ పంటలకు అందిస్తున్నారు.

చెరువులపై ఆధారం..

సరస్వతి కాలువ ద్వారా సాగు నీరు అందించడంతో పాటు చెరువుల కింద సాగు చేసిన పంటలకు అందిస్తారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండడంతో చెరువుల కింద సాగు చేసే రైతులకు యాసంగి సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఒక్కోసారి ప్రాజెక్టులోకి వరద నీరు రాని సమయంలో రెండో పంటకు నిరందక చెరువులోకి నీరు చేరక యాసంగి పంట సాగు చేయని సందర్భాలు కూడా ఉన్నాయి. వానాకాలం వరి పంట పొట్ట దశలో ఉండడంతో సరస్వతి కాలువ ద్వారా 550 క్యూసెక్కుల నీటిని అధికారులు అందిస్తున్నారు. కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

మరమ్మతులు కరువు..

ప్రధాన కాలువ సరస్వతీ కాలువతో పాటు ఉప కాలువలకు సిమెంట్ లైనింగ్ దెబ్బతినడం, వరదకు కోతకు గురవడం వంటి కారణాలతో చివరి ఆయకట్టు పంటలకు సాగు నీరందడం ఇబ్బందిగా మారింది. గతంలో యాసంగిలో చివరి ఆయకట్టుకు సాగునీరు అందక పంటలు ఎండిన సందర్భాలు ఉన్నాయి. సరస్వతీ కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. సరస్వతీ కాలువ చందారం, కొరిటికల్, న్యూలింగంపల్లి, వద్యాల్ సమీపంలో ఎక్కువగా దెబ్బతిన్నది. ఎక్కువ నీటిని విడుదల చేస్తే కోతకు గురయ్యే అవకాశం ఉంటుంది.

పూర్తిస్థాయిలో నీటి నిల్వ

ఐదు ఎకరాలలో వరి పంట సాగు చేశాను. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ పూర్తిస్థాయిలో ఉండడంతో సరస్వతీ కాలువ కింద రెండో పంట సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంది. సరస్వతీ కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలి. అప్పుడే చివరి ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.

– శ్రీనివాస్‌రావు, రైతు, చందారం

మరమ్మతులు చేయిస్తాం

సరస్వతీ కాలువ వర్షాల కారణంగా కొంత దెబ్బతిన్నది. మరమ్మతులు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందించాం. టెండర్‌లు నిర్వహించి మరమ్మతులు పనులు చేపడుతాం. పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉన్నందున యాసంగి సాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– లక్ష్మి, ఈఈ, నీటిపారుదలశాఖ

ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు హర్షణీయం


దుబాయ్‌లో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

ఖానాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు ప్రక్రియను ప్రారంభించడం హర్షణీయమని గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు అన్నారు. సోమవారం దుబాయ్‌లోని జేబల్‌అలీ లాల్ క్యాంప్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక వ్యవస్థాపకుడు దొనికెని కృష్ణ, తదితరుల దీర్ఘకాలిక పోరాటాలతో ప్రభుత్వం హామీలను అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కార్మికులు క్షీరాభిషేకం చేశారు. ఎన్‌ఆర్‌ఐ పాలసీ సాధన కోసం తెలంగాణలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందించిన సహకారాన్ని గల్ఫ్ కార్మికులు గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, పెద్ది రవికుమార్, మూడారపు పవన్‌సాయి పాల్గొన్నారు.

నీటి సరఫరాపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

దిలావర్‌పూర్: గ్రామాల్లోని నీటి సరఫరాలపై ప్రత్యేక దృష్టిని సారించాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. దిలావర్‌పూర్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరా సహాయకులకు సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామాల్లో సరఫరా అవుతున్న మంచినీరు అందరికీ అందే విధంగా చూడాలన్నారు. పైప్‌లైన్ వ్యవస్థ, వాటి రిపేరు సంబంధిత కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. మరో మూడు రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఉంటుందని వాటర్ గ్రిడ్ ఏఈ ఫిరోజ్, ఇంట్రా ఏఈ రాజశేఖర్‌లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణారాణి, ఏపీఎం సులోచన, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భగీరథ నీటి సరఫరా, విద్యుత్ మోటర్ల సమస్యలు తీర్చే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, డీఈ వినోద్, ఎంపీవో ఖలీల్ హైమద్, పాల్గొన్నారు.

తానూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని శుద్ధిచేయడంపై ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ నాలుగు రోజులు పాటు ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆదిత్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, డీఈ లక్ష్మినారాయణ, ఏఈలు శ్రీరామ్, అరుణ్, సూపర్‌వైజర్ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ ప్రయోజనాల కోసమే నూతన చట్టాలు


నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను సవరణ చేసి 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా మార్చారని ఐఎఫ్ టీయూ రాష్ట్ర కార్యదర్శి కె. రాజన్న అన్నారు. నాలుగు లేబర్ కోడ్లను నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం నాలుగు లేబర్ కోడ్లకు సంబంధించి పత్రాలను దహనం చేశారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గంగాధర్, గంగామణి, విజయ, లక్ష్మి, లలిత, భుక్య రమేశ్, అనంతరావు దుర్గే, రాజన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


ఖానాపూర్: ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

ఖానాపూర్: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. సోమవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటగదులు, పరిసరాలు, తరగతి గదులను శుభ్రం చేయించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, జన్నారపు శంకర్, షబ్బీర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

- గ్రామాల్లోని ఓపెన్ ప్లాట్లతో పాటు కుంటలు, నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్‌లు వేయడం ద్వారా దోమలను నివారించవచ్చని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మస్కాపూర్‌లో పర్యటించి ఆయిల్ బాల్స్ వేయించారు.

లక్ష్మణచాంద: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్ మధు అన్నారు. సోమవారం పోషణ అబియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ సంబురాలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పోషణ్ అభియాన్ ఈనెల 30 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సోన్: పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని సోన్ ఎస్సై గోపి అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

తానూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఫణి రాజశేఖర్ మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ పట్టివేత

బాసర: మండల కేంద్రంలోని రహదారిపై కొండ చిలువ స్థానికులకు కనిపించింది. దీంతో పాములు పట్టే వ్యక్తికి సమాచారం అందించి కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ చెత్త వాహనంలో అటవీ ప్రాంతానికి తరలించి వదిలేశారు.

దాడి చేసిన వ్యక్తికి జైలుశిక్ష

ఖానాపూర్: అకారణంగా దూషించడంతో పాటు కత్తెరతో పొడిచి తీవ్రంగా గాయపరిచిన కేసులో ఒకరికి 8 నెలల జైలు శిక్షతో పాటు రూ. 2100 జరిమానా విధిస్తూ.. సోమవారం కోర్టు తీర్పునిచ్చిందని ఎస్సై రాహుల్ తెలిపారు. పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన ఎగుర్ల సందీప్ అనే వ్యక్తి తన ఇంటికి నడుచుకుంటూ.. వెళ్తుండగా.. బొంగోని రాము, లక్ష్మణ్ అనే వ్యక్తులు అతడిని దూషించి, కత్తెరతో దాడి చేశారు. సందీప్ తల్లి కొమురక్క 2018లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సైలు కేసు నమోదు చేసి, చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ మేరకు ఏపీపీ దేవేందర్ 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా.. నేరం రుజువైంది. ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ బొంగోని రాముకు శిక్ష విధిస్తూ.. తీర్పునిచ్చారు.

యాచకురాలు మృతి

బాసర: శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమీపంలోని వ్యాస మహర్షి ఆలయం ప్రాంగణం ఎదుట గత కొంతకాలంగా భిక్షాటన చేస్తున్న గుర్తు తెలియని వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. స్థానికులు గమనించి ఆలయ అధికారులకు సమాచారం ఇచ్చినా.. పట్టించుకోవడం లేదని పలువురు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. విషయాన్ని తెలుసుకున్న సంబంధిత అధికారులు మృతి చెందిన వృద్ధురాలిని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

‘బీజేపీతోనే దేశం అభివృద్ధి’


సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

భైంసాటౌన్: ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని కిసాన్‌గల్లి 152 బూత్‌లో పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సభ్యత్వం నమోదు చేయించి, బీజేపీ పథకాలను ప్రజలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు సుష్మారెడ్డి, బొప్పూరి వెంకటేశ్, బండారి దిలీప్, కాసర్ల ప్రవీణ్, మల్లేశ్వర్ పాల్గొన్నారు.

కడెం: మండలంలోని పాండ్వపూర్, లింగాపూర్, చిట్యాల్, ఎలగడప, సారంగపూర్, మాసాయిపేట్ గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. జక్కుల సత్తెన్న, తిరుమల్, భీమన్న, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

బాసర: మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కిషోర్ దేశాయ్, మాజీ సర్పంచ్ సతీశ్వర్ రావు ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పుట్నాల సాయినాథ్ పటేల్, బల్గూరి నర్సింగ్రావు, కరివి పోతన్న, గంగారాం, పోశెట్టి పాల్గొన్నారు.

‘నిధుల కేటాయింపులో వివక్ష’


ఫిర్యాదు ప్రతిని చూపుతున్న కౌన్సిలర్లు

ఖానాపూర్: పట్టణ పరిధిలోని 12 వార్డులకు చెందిన ప్రజలు ఉన్నప్పటికీ 10 వార్డులలో నిధులు కేటాయించి, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించే రెండు వార్డుల్లో తక్కువ నిధులు కేటాయించి, వివక్ష చూపడం సరికాదని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, 8వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ కలీల్, 2వ వార్డ్ కౌన్సిలర్ కారింగుల సంకీర్తన అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం వార్డుల పరిధిలో అభివృద్ధి కోసం టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.4.8 కోట్లు విడుదల చేసిందన్నారు. అందులో నుంచి రెండో వార్డు, 8వ వార్డులకు రూ. 10లక్షలు కేటాయించి, మిగతా 9 వార్డులకు రూ.40లక్షల చొప్పున కేటాయించారని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ ప్రాతినిధ్యం వహించే 11వ వార్డుకు మాత్రం రూ.కోటి 19 లక్షలు కేటాయించారన్నారు. అధికార నేతలు తీసుకున్న నిర్ణయంతో మిగతా వార్డుల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సైని సన్మానించిన యువకులు

కుంటాల: ఇటీవల కుంటాలలో వినాయక నిమజ్జనోత్సవాలను ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు ప్రశాంత వాతావరణంలో జరిపించారు. ఇందుకు కృషి చేసిన ఎస్సై సీహెచ్. భాస్కరాచారిని సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో డి.వెంకటేష్, అనిల్ కుమార్, ప్రశాంత్, చిప్ప నరేశ్, కాశీరాం గజేందర్ పాల్గొన్నారు.

పర్యటన విజయవంతం చేయండి

ఖానాపూర్: షెడ్యూల్ ట్రైబల్ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ ఉమ్మడి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ కోరారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు, గిరిజనులు తరలిరావాలని కోరారు.

మంజూరు పత్రాల అందజేత

ఖానాపూర్: రూ.500లకే సిలిండర్ హామీలో భాగంగా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకం కింద పలువురు లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్‌పాషా, రేషన్‌డీలర్ కిషన్, తదితరులు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన దుర్గభవాని

కడెం: పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చొప్పదండి దుర్గభవాని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు.

ఆర్థిక సాయం

లోకేశ్వరం: మండలంలోని పోట్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, సాయినాథ్‌లు ఇద్దరు అనారోగ్యంతో బాధపడుతూ.. ఇటీవల మరణించారు. వీరి కుటుంబసభ్యులకు గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్, సందీప్ ఫౌండేషన్‌లు కలిసి చేరో రూ.5000 వేల చొప్పున నగదును సోమవారం వారి ఇంటి వద్ద ఉపాధ్యాయులు ఎల్లన్న అందజేశారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఆదివారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఇందులో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన జ్యోతికి చోటు దక్కింది. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. గురుకుల ఉపాధ్యాయుల, విద్యాసంస్థల ఉన్నతి కోసం తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

సోన్: ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే అన్ని క్రిమినల్, సివిల్ కేసులు పరిష్కరించబడుతాయన్నారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని, డబ్బు, సమయం వృథా కాదన్నారు.

మండలంలో వర్షం

లక్ష్మణచాంద: మండలంలో సోమవారం సాయంత్రం సమయంలో వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండ ఉండడంతో సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. రోడ్లపై ఆరబెట్టిన మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అద్భుతం కర్ర గృహం



నిర్మల్‌ఖిల్లా: గృహమే కదా స్వర్గసీమ అన్నారు పెద్దలు. అలాంటి కలల గృహాన్ని తన అద్భుతమైన కళతో తీర్చిదిద్దాడు ఓ విశ్వకర్మ. జిల్లా కేంద్రంలోని గాయత్రి పురం కాలనీకి చెందిన టేకులపల్లి గణేశ్ తన నైపుణ్యంతో కర్రతో కూడిన అందమైన గృహాన్ని తయారు చేసి అబ్బురపరిచాడు. జిల్లా కేంద్రంలో విశ్వకర్మ కౌశల్ సామాన్ యోజన పథకం ద్వారా కొనసాగుతున్న శిక్షణలో భాగంగా సోమవారం దీనిని ప్రదర్శించాడు.

అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

ఖానాపూర్: ప్రతీ వారం మండల కేంద్రాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌ను సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పర్యవేక్షించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ శివరాజ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

భైంసాటౌన్: సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం సమత ఫౌండేషన్ చైర్మన్ సమతా సుదర్శన్ మాజీ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సేవా కార్యక్రమాలు నిరుపేదలకు అందేలా కొనసాగించాలన్నారు. ఫౌండేషన్ ఆర్గనైజర్ సాహెబ్ రావ్, సీఈవో అనిల్, పవార్ సిద్ధార్థ, దేవేందర్ పటేల్, లక్ష్మణ్ ఉన్నారు.